క్లుప్తంగా

మృతుడి కుటుంబానికి పరామర్శ



మృతునికి నివాళులర్పిస్తున్న నాయకులు

పుట్టపర్తి టౌన్: కొత్తచెరువు మండలం లోచర్ల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత ఈశ్వర్‌రెడ్డి(45) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సోదరుడు దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి మృతుడి ఇంటి వద్దకు వెళ్లి ఈశ్వర్‌రెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళ్ఫించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సర్పంచ్ గంగులమ్మ, వైస్ ఎంపీపీ గంగరాజు, నాయకులు అశోక్‌రెడ్డి, రాజారెడ్డి, నారాయణస్వామి, వెంకటేష్, సూరి, శ్రీనివాసరెడ్డి, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం వేలం

పుట్టపర్తి టౌన్: బ్రాహ్మణపల్లి సెబ్ పోలీసులు శనివారం ద్విచక్రవాహనాన్ని వేలం నిర్వహించారు. వేలం ద్వారా రూ.22 వేలు వచ్చినట్లు సెబ్ డీఎస్పీ సుబ్రమణ్యం, డీటీఎఫ్ సిఐ మోహన్‌రెడ్డి, సెబ్ సీఐ కన్నయ్య తెలిపారు.

కంపచెట్ల తొలగింపు



రాగన్నగారి పల్లి వద్ద కంప చెట్లను తొలగిస్తున్న దృశ్యం

నల్లచెరువు: జాతీయ రహదారి నుంచి రాగన్నగారిపల్లి వరకూ రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు పేరిగి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే గ్రామస్తుల ద్వారా సమస్యను తెలుకున్న నల్లచెరువు మేజర్ పంచాయితీ సర్పంచ్ పంచ రత్నమ్మ శనివారం జేసీబీ సాయంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంప చెట్లను తొలగింపజేశారు. ఈసందర్భంగా సర్పంచ్ పంచరత్నమ్మను గ్రామస్తులు అభినందించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఉత్తన్న, హనుమంతురెడ్డి పాల్గొన్నారు.

వర్షం కోసం ప్రత్యేక పూజలు

బత్తలపల్లి: పోట్లమర్రి గ్రామంలో శనివారం వర్షం కురవాలని ప్రార్థిస్తూ గ్రామపెద్దల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈసందర్భంగా గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో భజనలు చేశారు. అనంతరం చింతలపల్లి సమీపంలోని చెర్లో హనుమంతు రాయుని వద్దకు కాలినడకన రామభజనలు చేసుకుంటూ వెళ్లి పూజలు నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటి నుంచి సేకరించిన బియ్యం, బెల్లంతో అక్కడే బాణాలు వండి భక్తులకు పంపిణీ చేశారు.

ప్రజాచైతన్య ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

కదిరి టౌన్: పట్టణంలో పారిశుధ్య నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణపై శనివారం ప్రజా చైతన్య ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ మాట్లాడూతూ పట్టణంలో ఎక్కడపడితే అక్కడ చెత్తవేయరాదన్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ చెత్తబండిలో వేయాలన్నారు. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ర్యాలీలో పట్టణ సీఐ డీవీ నారాయణరెడ్డి, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాపరికరాల అందజేత

తలుపుల: స్థానిక కస్తూర్బా పాఠశాల విద్యార్థినులకు శనివారం ఆర్డీటీ ఆర్‌డీ శాంతమ్మ, ఏటీఎల్ లక్ష్మన్న జీఎస్‌ఎన్ నిధి ద్వారా రూ.50 వేల విలువైన క్రీడాపరికరాలను అందజేశారు. ఎస్‌ఓ మోహనమ్మ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్‌డీ శాంతమ్మ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని సూచించారు.



ప్రత్యేక చట్టాలతోనే వైద్యులకు రక్షణ

వైద్యులపై దాడులు జరగకుండా ఉండేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలను తీసుకురావాలి. కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన అఘాయిత్యానికి దేశ వ్యాప్తంగా నిరసనలు చేస్తున్నా ఇప్పటి వరకు ప్రభుత్వం ప్రత్యేక చట్టాలను తీసుకొస్తామని చెప్పలేదు. మహిళా వైద్యులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.

– డాక్టర్ వి.చంద్రిక,
ధర్మవరం ప్రభుత్వాస్పత్రి





రాజకీయ పెత్తనం ఉండకూడదు

ప్రభుత్వాస్పత్రికి వచ్చే కొంత మంది రాజకీయ నాయకులు వైద్యులపై పెత్తనం చేస్తుంటారు. వైద్యులు రోగులకు వైద్యం చేసేందుకే ఉంటారు. కాని రాజకీయ నాయకులు బెదిరింపు ధోరణితో వైద్యులను భయభ్రాంతులకు గురి చేస్తుంటారు. ఇది సరైన పద్ధతి కాదు. ప్రభుత్వాస్పత్రుల్లో రాజకీయ పెత్తనం లేకుండా చూడాలి.

– డాక్టర్ నివేదిత,
ధర్మవరం ప్రభుత్వాస్పత్రి

ప్రజా సమస్యలు తక్షణం పరిష్కరించాలి



మండల మీట్‌లో మాట్లాడుతున్న అధికారులు

తనకల్లు: ప్రజా సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఎంపీపీ వైవీ కౌసల్య, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటరమణ అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీరు, వీధిదీపాలు, రోడ్లు తదితర సదుపాయాలను కల్పిస్తామన్నారు. పండ్లతోటల పెంపకానికి ప్రభుత్వం అందజేస్తున్న ప్రోత్సహకాలను సద్వినియోగం చేసుకోవాలని హార్టీకల్చర్ అధికారి లావణ్య తెలిపారు. తనకల్లు, కొక్కంటిక్రాస్‌లోని జాతీయ రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసిన లైట్లు వెలగక నెలల గడుస్తున్నా పట్టించుకోవడం లేదని ఎంపీటీసీ అమర్ కార్తికేయ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అలాగే మండల కేంద్రం, బాలసముద్రం వద్ద రైల్వే అండర్ బ్రిడ్జీల కింద వర్షపు నీరు నెలల పాటు నిలిచిపోతుండడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాగా సమావేశం మధ్యలోనే పలుశాఖల అధికారులు బయటకు వెళ్లిపోవడంతో ఎంపీటీసీలు, సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైస్ ఎంపీపీలు నాగలక్ష్మి, రమణమ్మ, ఎంఈఓ కళ్యాణి, ఏఈలు బయప్ప, కవిత, కిశోర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయమ్మ, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు



గాండ్లపెంట మండలం వేపరాలలో పూజలందుకున్న ఆంజనేయస్వామి

గాండ్లపెంట: శ్రావణ మాసం 3వ శనివారాన్ని పురస్కరించుకుని మండలవ్యాప్తంగా ఆంజనేయ స్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేపరాల, మునగలవారిపల్లి, బోలిగుట్లపల్లి, నీరుకుంట్లపల్లి, రెక్కమాను తదితర గ్రామాల్లో భక్తులు స్వామి వారికి ఆకుపూజలు నిర్వహించారు. వేపరాల ఆంజనేయస్వామి ఆలయానికి వచ్చిన భక్తులకు తాళ్లకాల్వకు చెందిన లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

ఎన్‌పీకుంట: పెడబల్లి, పాపన్నగారిపల్లి, దనియానిచెరువు, వెలిచలమల గ్రామాల్లోని అభయాంజనేయ స్వామి ఆలయాల్లో శనివారం శ్రావణమాస పూజలు ఘనంగా నిర్వహించారు. మూలవిరాట్‌ను ప్రత్యేక పూలతో అలంకరించి ఆకుపూజ, కుంకుమార్చన తదితర పూజలు చేపట్టారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

బత్తలపల్లి: పోట్లమర్రిలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణ మాసం మూడవ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు కొమందూరు మారుతిప్రసాద్, సాయిక్రిష్ణ ఆధ్వర్యంలో ఆకుపూజ నిర్వహించి భజనలు చేశారు. ముష్టూరు, మాల్యవంతం, వేల్పుమడుగు గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో పూజలు జరిగాయి.

తాడిమర్రి: ఏకపాదంపల్లిలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ మాసం పురష్కరించుకుని ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు.

పీజీ నీట్‌లో విద్యార్థుల ప్రతిభ



ఆర్.అలేఖ్య



రాజు శంకర్ దీక్షిత్

తలుపుల: దేశవ్యాప్తంగా శనివారం వెలువడిన పీజీ నీట్ పరీక్షల్లో రాజనాలవాండ్లపల్లికి చెందిన డీఎస్సీ–98 ఉపాధ్యాయుడు ఆర్. వేణుగోపాల్‌రెడ్డి, మహేశ్వరి కుమార్తె ఆర్.అలేఖ్య 5,294 ర్యాంకు సాధించింది. గతంలో యూజీ నీట్‌లో జాతీయ స్థాయిలో 9078, రాష్ట్ర స్థాయిలో 551 ర్యాంకు సాధించి కర్నూలు వైద్యకళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసింది. ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్నదే తన లక్ష్యమని అలేఖ్య తెలిపారు.

కదిరి అర్బన్: స్థానిక ఎన్జీఓ కాలనీలో నివాసం ఉండే రాజు శంకర్ దీక్షిత్ పీజీ నీట్ ఫలితాల్లో 5923వ ర్యాంక్ సాధించాడు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు శంకర్‌రెడ్డి, లేట్ ఉషారాణి దంపతుల కుమారుడు రాజుశంకర్ దీక్షిత్. ఎండీ జనరల్ సర్జన్ కావాలన్నదే తన, తన తల్లిదండ్రుల ధ్యేయమని దీక్షత్ తెలిపారు.

ఎముకల పటుత్వ పరీక్షలు



వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని విజయలక్ష్మి ఆయుర్వేద ఆలయ, ఫిజియోథెరపీ క్లినిక్‌లో శనివారం జందు ఫార్మా, అవోపా ఆధ్వర్యంలో ఉచిత ఎముకల పటుత్వ పరీక్ష శిబిరాన్ని నిర్వహించారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సెల్వియా సాల్మన్ నిర్వాహకులను అభినందించారు. రూ.1500 నుంచి రూ.2 వేల వరకు ఖర్చు అయ్యే వైద్యపరీక్షలను ఉచితంగా చేస్తున్నామని అవోపా జిల్లా అధ్యక్షుడు వెంకటేష్‌బాబు, కార్యదర్శి సత్యరామ్, పట్టణాధ్యక్షుడు డాక్టర్ శీబా నగేష్‌గుప్త, జిల్లా ఇన్‌చార్జ్ అన్న లక్ష్మీనారాయణ తెలిపారు. శిబిరం 125 మందికి పరీక్షలు చేయించుకున్నారన్నారు. అవోపా సభ్యులు జయంతి శ్రీనివాసులుశెట్టి, రాష్ట్ర ఎస్టాబ్లిష్ చైర్మన్ చంద్రమహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఖాద్రీశుడికి ప్రత్యేక పూజలు



భక్తులతో కిటకిటలాడుతున్న ఖాద్రీ ఆలయం

కదిరి టౌన్: శ్రావణ శనివారం సందర్భంగా ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. మహిళలు ఆలయం ఎదుట దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అధికారులకు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా సైదాపురం ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు.

వానరానికి అంత్యక్రియలు

ఎన్‌పీకుంట: వంకమద్ది గ్రామంలో శనివారం ప్రమాదవశాత్తు ఓ వానరం మృతి చెందింది. మృతి చెందిన వానర కళేబరాన్ని గ్రామానికి చెందిన రమణ, ఓబులప్ప, చంద్రశేఖర్ పూజలు నిర్వహించి సంప్రదాయ బద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు.

మత్తుతో భవిష్యత్ చిత్తు

చెన్నేకొత్తపల్లి: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి క్రమశిక్షణతో చదువుకోవాలని సెబ్ సీఐ లలితాదేవి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎవరైనా మాదక ద్రవ్యాలను అక్రమంగా విక్రయిస్తుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. మాదక ద్రవ్యాలను భవిష్యత్తు అంధకారంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో సెబ్ ఎస్‌ఐ శివప్రసాద్, సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలు



కాకతీయ స్కూల్‌లో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు



గోపిక, శ్రీకృష్ణుని వేషధారణలలో రూపారాజ పీసీఎంఆర్ విద్యార్థులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కాకతీయ విద్యానికేతన్ పాఠశాలలో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో చిన్నారులు శ్రీకృష్ణుని వేషధారణలో అలరించారు. విద్యార్థినులు గోపికలు, రాధల వేషధారణలో ఉండగా చిన్ని కృష్ణులు ఉట్టి కొట్టారు. కాకతీయ పాఠశాల కరస్పాండెంట్ నిర్మలా జయచంద్రారెడ్డి కృష్ణలీలలపై విద్యార్థులకు వివరించారు. పాఠశాల డైరెక్టర్ సూర్యప్రకాష్‌రెడ్డి, పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధర్మవరం: రూపారాజా పీసీఎంఆర్ పాఠశాలలో శనివారం నిర్వహించిన ముందస్తు శ్రీకృష్ణాజన్మాష్టమి వేడుకలు అలరించాయి. పాఠశాలలోని చిన్నారులు, శ్రీకృష్ణ, గోపిక, సత్యభామల వేషధారణలతో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమంలో పాల్గొని ఉల్లాసంగా గడిపారు. ఈ సందర్భంగా రూపారాజా పీసీఎంఆర్ చైర్మన్ హర్షవర్ధన్ మాట్లాడుతూ శ్రీకృష్ణాష్టమి పర్వదిన విశిష్టతను వివరించేందుకు కార్యక్రమం చేపట్టామన్నారు. పాఠశాల డైరెక్టర్లు రూపారాజకృష్ణ, జగదీష్, కరస్పాండెంట్ నాగమోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నరేష్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడి నేత్రాలు దానం

తాడిమర్రి: మండల కేంద్రానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడుమల్లప్పగారి నాగిరెడ్డి(74) శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. ధర్మవరానికి చెందిన యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుని కుమార్తెల సహకారంతో ఎల్‌వీ ప్రసాద్ ఆసుపత్రి టెక్నీషియన్ లక్ష్మణ్ నేత్రాలు సేకరించారు. నాగిరెడ్డి మృతి సమాచారం తెలుసుకున్న డీసీఎంఎస్ మాజీ అధ్యక్షులు తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి, ఉప సర్పంచ్ తాడిమర్రి రమణారెడ్డి, నాయకులు మల్లప్పగారి మాధవరెడ్డి తదితరులు నాగిరెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుని భార్య నాగలక్ష్మి, ఇద్దరు కుమార్తెలను ఓదార్చారు.

ఆయుర్వేద వైద్యుడు నబీరసూల్‌కు ఉత్తమ సేవా అవార్డు



ధర్మవరం: పట్టణానికి చెందిన ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు నబీరసూల్ టీడీయూ (యూనివర్సిటీ ఆఫ్ ట్రాన్స్ డిసిప్లినరీ హెల్త్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ) నుంచి ఉత్తమ సేవా అవార్డును అందుకున్నారు. అనువంశిక ఆయుర్వేదంలో నబీరసూల్ చేసిన పరిశోధనలు, పేదలకు ఉచితంగా అందిస్తున్న వైద్య సేవలను గుర్తిస్తూ వర్సిటీలో ఈనెల 21న జరిగిన కార్యక్రమంలో డాక్టర్ ప్రకాష్ నబీరసూల్‌కు అవార్డు అందించారు.

కేబుల్ చోరీ

ధర్మవరం రూరల్: ఏలుకుంట్ల గ్రామానికి చెందిన చంద్రమోహన్ అనే రైతుకు చెందిన విద్యుత్ మోటర్ కేబుల్‌ను శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. సుమారు 40 మీటర్ల వరకు కేబుల్‌ను ఎత్తుకెళ్లినట్లు బాధితుడు వాపోయాడు.

కారు అపహరణ

ముదిగుబ్బ: స్థానిక పాత పోస్టాఫీసు సమీపంలో నిలిపి ఉంచిన కారును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. పాత పోస్టాఫీసు సమీపంలో నివాసం ఉంటున్న విజయసింహ శుక్రవారం రాత్రి ఇంటి ముందు కారు నిలిపాడు. గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి దాటిన తర్వాత కారును ఎత్తుకెళ్లారు. శనివారం ఉదయం గమనించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బైక్ ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

నల్లచెరువు: స్థానిక హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్ద శనివారం రాత్రి బైక్ ఢీకొని ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. తనకల్లు మండలం దేవళం తండాకు చెందిన శ్రీరాములు నాయక్ వ్యక్తిగత పనులపై కదిరికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి ఆటోలో బయలుదేరాడు. అయితే పెట్రోల్ బంకు వద్ద ఆటో దిగి రోడ్డు దాటుతుండగా తనకల్లు వైపు వెళ్తున్న బైక్ ఢీ కొంది. ప్రమాదంలో అతడి తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు 108కు ఫోన్ చేయగా వాహనం ఎంతసేపటికీ రాకపోవడంతో ఆటోలో స్థానిక ఆసుపత్రికి తరలించారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ చేయాలి

కదిరి అర్బన్: ఎస్‌టీఎస్‌ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిధులను దుర్వినియోగంపై విచారణ జరపాలని విద్యార్థి సంఘాల నాయకులు శనివారం ఆర్డీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ పావనికి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత ఐదేళ్లుగా కళాశాలకు వచ్చిన నిధులపై సమగ్ర విచారణ జరపాలన్నారు. ఏఐఎస్‌ఎఫ్, ఆర్‌ఎస్‌వైఎఫ్, ఎన్‌ఎస్‌యూఐ, ఏఐఎస్‌ఓ నాయకులు నరసింహ, అరుణ్‌కుమార్, ఉపేంద్ర, నిరంజన్, సాయికుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టెలికాం రంగంలో ట్రాయ్ పాత్ర కీలకం



మాట్లాడుతున్న పీడీ నరసయ్య

పుట్టపర్తి టౌన్: టెలికాం సేవల ప్రమాణాల రూపకల్పనలో టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) పాత్ర కీలకమని ఆసంస్థ సీఏజీ సభ్యురాలు శారద తెలిపారు. శనివారం పట్టణంలో డీఆర్డీఏ కార్యాలయంలో టెలికాం వినియోగదారుల అవగాహన సదస్సు నిర్వహించారు. డీఆర్డీఏ పీడీ నరసయ్య, జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షుడు సురేష్‌కుమార్ జిల్లా మహిళా అధ్యక్షురాలు గంగా, అనూషా, రోజా హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 1909కు ఫిర్యాదు చేయడం ద్వారా రెండేళ్లపాటు అవసరం లేని కాల్స్‌ను బ్లాక్ చేయొచ్చన్నారు. పుట్టపర్తి నియోజకవర్గం వ్యాప్తంగా ఐదు చోట్లు సెల్ టవర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సోషల్ సర్వీస్ అసిసోయేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు హరికృష్ణ, ట్రెజరర్ శివ, ఈసీ మెంబర్ లక్ష్మి, బీఎస్‌ఎన్‌ఎల్ డీఈ పృథ్వీప్రసాద్ వీరభద్ర తదితరులు పాల్గొన్నారు.

వ్యభిచార గృహ నిర్వాహకులపై కేసు నమోదు

కదిరి టౌన్: వ్యభిచార గృహం నిర్వహిస్తున్న ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. కందికుంట నారాయణమ్మ కాలనీలోని రైల్వే బ్రిడ్జి సమీపంలోని ఒక ఇంటిలో వ్యభిచారం చేస్తున్నారని పోలీసులకు సమాచారం రావడంతో పట్టణ సీఐ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వాహకులు కడియాల పుష్పలత, అల్లాపాటి అంజినమ్మతోపాటు ఇద్దరు విటులను అరెస్ట్ చేసి వారిపై కేసు నమోదు చేశారు. బెంగళూరు నుంచి అమ్మాయిలను పిలిపించి వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

ఎంవీఆర్‌పీఎస్ పట్టణాధ్యక్షుడిగా భాస్కర్



ధర్మవరం: ఎంవీఆర్‌పీఎస్ పట్టణాధ్యక్షుడిగా సాకే భాస్కర్(బాచి)ని ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. స్థానిక లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో శనివారం ఎంవీఆర్‌పీఎస్ రాష్ట్ర, జిల్లా నాయకులు పులి కొండన్న, చిన్నూరు నరసింహులు, సాంబ, చింతకాయల నరేష్‌ల సమక్షంలో నూతన కమిటీని ఎంపిక చేశారు. ఎస్సీ పునరుద్ధరణ, వాల్మీకుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. ఎంవీఆర్‌పీఎస్ నాయకులు బోనాసి సూర్యనారాయణ, సాకే ఆదిశేషు, సింహాద్రి, సాకే రాజు, సాకే రామకృష్ణ, సాకే దుర్గప్రసాద్, నవీన్, శివ, మండల రాము తదితరులు పాల్గొన్నారు.

స్వీపర్లను విధుల్లోకి తీసుకోవాలి

పుట్టపర్తి టౌన్: కొత్తచెరువు ప్రభుత్వాసుపత్రిలో ఇటీవల తొలగించిన స్వీపర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ డిమాండ్ చేశారు. శనివారం కొత్తచెరువు ప్రభుత్వాసుపత్రి ఎదుట తొలగించిన స్వీపర్స్‌తో కలసి ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్ గడువు ఉన్నప్పటికీ కార్మికులను తొలగించడం అన్యాయమన్నారు. వెంటనే కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. సీఐటీయూ నాయకులు ముత్యాలు, శంకర్‌రెడ్డి, వెంకటేష్, బ్యాళ్ల అంజి పాల్గొన్నారు.